

**ని**రంజనం నిద్రలేచాడు.

నిరంజనం నిద్రలేచేడంటే ఇంగ్లీష తెలుగు దిన పత్రికల్ని చేరవేసే రైల అప్పటికప్పుడే ఆవూరి స్టేషన్ చేరిన లెఖ్ఖ, నిరంజనం నిద్ర లేచేడంటే మాణిక విలాస్ ప్రొప్రయిటర్-కమ్. సర్వర్-క పరుకు మాష్టర్-మాణిక్యం తొలి ఇ వాయి దించినట్లు లెఖ్ఖ. నిరంజనం ని లేచేడంటే సరిగ్గా తెల్లవారు ఝాము వాలుగున్నరయినట్టు లెఖ్ఖ,

లెఖ్ఖ ప్రకారం నిరంజనం నిద్రలేచేడ లేచీలేవటంతోనే అతనికి "మ్యావ్ మ్యావ్ యెదురైంది.

నిరంజనం తెరిచీ తెరవని కళ్ళ తక్కున మూసుకున్నాడు, తనలో త వినుక్కున్నాడు, దాని రూపాన్ని ఊహి చుకుని చీదరించుకున్నాడు. వెధ శకునం' అని లోలోపల కసురుకున్నాడ తడకు 'ఖర్మ' అని పైపైకితిట్టుకున్నాడ

'రాణీ' అంటూ గొంతెత్తి పిలిచి పిలుపుకు 'మ్యావ్ మ్యావ్' వాకిట్లో గెంతింది, రాణి పేరున అంతఃపు మర్యాదల్ని పొందుతున్న ఆ మార్జాల ఇంటివాళ్లది.

'రాణీటు, రాణి... హుః పట్టెడన్న లేక శోషొచ్చి పడిపోయిందం పిల్లదానికి మెతుకు పెట్టటానికి ప్రాణ పోతుందిగానీ, పిల్లికి మాత్రం రా భోగాలు జరుపుతారు ... ఇంతకీ అ దాని జాతక మహిమ'—

అతనికి ఇంటి వాళ్లంటే కసి. వాళ్ల తనమీద జాలీసానుభూతీ లేవని. అతని కలిగివింటి వాళ్లంటేనూ కసీ, కోపమే వాళ్లకున్న అనందాలూ సుఖాలూ తన లేవని.

ఒకప్పుడు జీతపు మబ్బుల చోటు ఆశలు, ఆశయాల వెలుగును మరుగ తరచుతున్న గుమాస్తా సూర్యుడు నిర జనం, రిట్రెంచ్‌మెంటు గా హు గుమాస్తా సూర్యుణ్ణి మింగేస్తే సాద మనిషిగా మిగిలి పోయేడు నిరంజనం.

ఇవాళ్టి నిరంజనం నిరుద్యోగి. ని ద్యోగి నిరంజనంకి కసీ,కోపంవూ ఎక్కు మరి !

పెదవులు బిగపట్టి మరో నాలుగు సార్లు "హుః... హుః..." అనుకుంటూ లేచి మంచంమీద కూర్చున్నాడు నిరంజనం.

మంచానికి క్రిందగా ఇందిర. పాల కోసం పైటని లాగుతున్న పసిదాన్ని కసురుకుంటూ ప్రక్కకి తిరుగుతోంది. ఇందిర నిరంజనం సహధర్మ చారిణి ! ఆమెకు కొంచెం దూరంలో గోనె పట్టా మీద సత్యం, రాజు. వాళ్లిద్దరికీ తల వైపున కుక్కిమంచంలో రమ, రాజ్యం!

నిరంజనం చూపులు రమమీద నిలి చేయి.

నిరుద్యోగి నిరంజనంది నిండు సంసారం. రోజుకు రెండుశేర్ల బియ్యం ఆ సంసారానికి కనీసావసరం. ఆకనీసావ సరాన్ని సేకరించి పెడుతున్న కష్టజీవి రమ. కష్టజీవి రమ ఎలిమెంటరీ స్కూలు టీచర్.

కూతురే అయినా, కొడుకులా చేతి కొచ్చి మాబతుకులు బయటపడకుండా ఆదుకుంటోంది — నిరంజనంలోని తండ్రి ప్రాణం కన్నకూతురే అయినా ఆమెపట్ల కృతజ్ఞతతో నిండి పోయింది.

నిరంజనం కళ్లల్లో నీరు తిరిగింది. చేత్తో కళ్లు తుడుచుకుని మంచం దిగబో యేడు. కాళ్లు భార్యకి తగిలేయి.

ఇందిర లేచింది లేస్తూనే అన్నది. 'అప్పుడే లేచారేం. పడుకోండి'

అతను మాట్లాడలేదు, ఆమె మాట లోని పరుషదనానికి మనస్సు చివుక్కు మంది.

నిరుద్యోగి నిరంజనంకి ఆత్మాభి మానం హెచ్చు. ఆత్మాభిమానానికి వాళ్లావిడ వాడే పారిభాషిక పదం రోషం !

నిరుద్యోగి నిరంజనంకి ఆలోచనా ధోరణీ హెచ్చే. ఆలోచనా ధోరణికి అతని సహధర్మచారిణి ఊతపదం. పిచ్చి !'

నిరంజనంకి రాత్రి జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది. కంచంలో అన్నంపెట్టి ఆ వెంటనే దులిపేయటం మొదలెట్టింది ఇందిర తననూ. 'రేపట్నుంచీ తెల్లవారు ఝాముస్నే లేచి స్టేషన్‌కేం పోవక్కర్లేదు.

అడ్డమైన చెత్త కాగితాల్ని పోగుచేసు కొచ్చి ముందేసు కూర్చోనక్కర్లేదు. ఉప్పుకో చింతపండుకో ఉపయోగానికి కొచ్చే చిల్లర డబ్బులు కాస్త దాని మొహాన్న పోయటం మానేయండింక. ఈడొచ్చిన ఆడపిల్ల పెళ్లీ పెటాకులూ లేకుండా సంపాయిస్తుంటే—తిని కూర్చోటం కాక ఈ వ్యసన మొకటి.

నిరంజనం పెదవి విరిచి తనలో తను గొణుక్కున్నాడు. నిజమే. రమ సంపా దిస్తుంటే తిని కూర్చోటం నాకు సిగ్గు గానే వుంది. కాని, తనేంచేయగలడు.

'జాతక మహిమ'— నిరంజనం కుడి అరచేతిని సాచి చూసుకున్నాడు. చిన్నప్పుడెప్పుడో ఒక జోస్యుడు చెప్పేడు తనది యోగ జాతకమని. నిజమే వాడి వరకూ వాడూ కరెక్టే తనది భ్రష్టయోగం !

'మన జాతకాలూ, యోగాలు మనకు కనబడుతూనే వున్నవేగానీ, నువ్వీ అలవాటుని మానేయాలి నాన్నా నా మాట విని రేపట్నించీ ఆ పుస్తకాలూ, పేపర్లూ చూడకు'— రమ సౌమ్యంగా, ప్రాధేయ పూర్వకంగా చెప్పింది. ఒక్కసారి కాదు, చాలా సార్లు చాలా విధాలుగా. అయితే తనకు మాత్రం ఆశ చావడంలేదు.

నిరుద్యోగి నిరంజనంకి అన్నీ పోగా మిగిలిన పెన్నిధి ఆశ మాత్రమే.

అతని అదృష్టంమీద అతనికి నమ్మకం ఎక్కువ. అతని తెలివి తేటల మీద అతనికి విశ్వాసం ఎక్కువ, అతని

జాతకే చక్రంమీద అతనికి గురి ఎక్కువ.

నిరుద్యోగి నిరంజనం—ఆ విధంగా గొప్ప ఆశాజీవి.

ఆశ గురించిన ఆలోచనకే ఏనుగంత సత్తువవచ్చింది నిరంజనంకి. మంచం దిగి పిల్లల పక్కల్ని దాటుకుంటూ పెరట్లోకి నడిచేడు. అతని వెనగ్గా యిందిర బయల్దేరింది.

ప్రహరీగోడ గూట్లోకి చెయ్యిపోనిచ్చి కచ్చికని తీసుకున్నాడు నిరంజనం. నుయ్యి చప్టామీదికొచ్చి పళ్లుతోమటం మొదలెట్టేడు. కచ్చికను చితుపుతుంటే గతం కదిలింది నిరంజనం కళ్ళముందు.

ఓల్డు ఎఫ్. ఏ. నిరంజనం — ఒకప్పుడు వాడుకాక పూర్వం టూత్ పేస్ట్ లే వాడేవాడు, గుమాస్తా నిరంజనం నంజన్ గూడు పండ్లపొడిని వాడేవాడు. నిరుద్యోగి నిరంజనం కచ్చికవాడుతున్నాడిప్పుడు.

'జాతక మహిమ!'—నవ్వొచ్చింది నిరంజనంకి. నిరుద్యోగి నిరంజనంకి లోపల ఏడుస్తున్నా పైకి నవ్వటం చాతొచ్చు.

'ఇవాళ తారీఖు ఇరవైఎనిమిది, అమ్మాయ్ చేతిలో కానీలేదుట. యింకా ఆరురోజులు గడవాలి — దాని జీతం రావాలంటే' పైట చెంగుతో ముఖం తుడుచుకుంటూ చెప్పింది ఇందిర.

నోట్లో నీళ్లని పుక్కిలించి వుమ్మి భార్యవైపు చూసేడు నిరంజనం. ఆ చూపుల్లోని నిస్సహాయతని సహ ధర్మచారిణి గ్రహించింది.

'కానీ' అంటూ యింట్లోకొచ్చేసేడు నిరంజనం. అతని మెదడ్లో ఆలోచన మొదలైంది. 'ఇవాళ తారీఖు ఇరవై ఎనిమిది—' 'ఇరవై ఎనిమిది,'.

—రెండు, ఎనిమిది! ఎనిమిది, రెండు!—

ఇరవై ఎనిమిది! ఎనభై రెండు!—

ఈ రెండు అంకెలూ నిరంజనం బుర్రని తొలిచేయటం మొదలెట్టేయి. అతనిలో ఏదో ఆవేశం, ఉత్సాహం, ఆశ—విజృంభించేయి.

అద్దంముందు నిలబడి తడి చేతులతో జుట్టుని దువ్వుకున్నాడు. నిజానికి ఆ దూలానికి తగిలించిన సొరె అద్దంలో అతని ముఖాకృతే పూర్తిగా కనిపించదు. అందులో నూచికటి. నిరుద్యోగి నిరంజనం నూనె రాసుకుని తల దువ్వుకోవటం ఎప్పుడో మానేసేడు. అతనికి దువ్వేన అవసరమూ లేదిప్పుడు.

'ఎయిట్, టూ—టూ ఎయిట్' అనుకుంటూ బయల్దేరబోతున్న నిరంజనంకి భార్య పిలుపు వినిపించింది.

'చూడండి...'

నిరంజనం ఆగి వెనక్కిచూసేడు.

'రాత్రి చెప్పిందంతా బూడిదలో పోసిన పన్నీరైందా—అప్పుడే బయల్దేరారు.'

'లేదు లేవే. ఎటూ నా దగ్గర డబ్బు లేవుగదా. ఊరికే అలా పోయొస్తా ఆరేళ్ల అలవాటు. అరపూటలో పొమ్మంటే పోతుందా'

ఇందిర మాట్లాడలేదు.

నిరంజనం భారంగా కదిలేడు. భార్య పదే పదే అదే విషయాన్ని హెచ్చరిస్తుంటే అతనికి కోపంవూ, కసీ కలుగుతున్నై. కానీ, అంతలోనే ఆమె మాటల్లోని కటిక నిజాన్ని త్రోసేయలేక పోతున్నాడతను. నిరంజనంకి అనిపించింది—'ఇంతగా నేనీ వ్యసనానికి బానిసనై పోయానేమా?' అని.

'ఛా—ఛా— పెళ్లాం పిల్లల చేత పాటికి పదిసార్లు చెప్పించుకునే దుస్థితి కొచ్చేను. ఈ అలవాటుకి ఇవాళ్టితోనే స్వస్తి చెప్పాలి'

నిరంజనం వెనక్కి తిరిగేడు. ఇంటికేసి నాలుగడుగులు వేసేడు. ఐదో అడుగు పడనంది. ఎయిట్ టూ, టూఎయిట్ కళ్లముందు కనిపించినై. 'ఇది చివరి ఛాన్స్. ఈ ఒక్క ప్రయత్నంతో ఈ వ్యసనానికి స్వస్తి అనుకుని మళ్లీ వెనక్కు సాగేడు.

అప్పుడే వేకువ విచ్చుకుంటోంది. పట్టణ వాతావరణం ప్రశాంతి నుంచీ కోలాహలంలోకి దిగబోతూంది. బస్సుల రొద ప్రారంభమైంది.

నిరంజనం ఆలోచిస్తూ నడుస్తున్నాడు. ఇవాళ నిద్రలేస్తూనే పిల్లినిచూసేడు తను. రాణీని చూస్తేగాని ఉదయాన్నే నిద్ర లేవదట తమ యింటి చిన్నమ్మగారు. ఆశకునం ఆవిడకు అదృష్టదాయకంట. తనకూ అలాగే 'మ్యావ్ మ్యావ్' శకునం ఇవాళ అదృష్టాన్నిస్తుందేమో. దీనికి తోడు ఇందిర, ఇవాళ తారీకు ఇరవై ఎనిమిది—అంటూ గుర్తుచేసింది. రెండూ, యెనిమిదీ—ఈ రెండు సంఖ్యలూ అదృష్టాన్ని కలిగించే సంఖ్యలని చదివేడు తను—తన రాశిఫలంలో. వీటన్నిటికీ మించి తనకేదో దివ్యవాణి వినిపిస్తోంది—నిరుద్యోగి నిరంజనం దశ ఇక మారబోతోందని. తప్పదు—తన అంచనా తారుమారుకావటాకి వీల్లేదు.

'ఏం నిరంజనం. నీ నెంబరెంత?'

నిరంజనం ఆగేడు.

ఆలోచన తెగింది. ఎదురుగా రామస్వామి. అతనివైపు ఎగాదిగా చూసేడు నిరంజనం. రామస్వామి ముఖంలో సంతోషం తాండవిస్తోంది.

'నేను కట్టలేదు నిన్న' అన్నాడు నిరంజనం.

'నా నెంబరొచ్చింది. డబల్ ఫోర్...' ఆనందంగా చెప్పేడు రామస్వామి.

'ఎంత?'

'ఆం... ఎంతలే పావలా'

'ఉహూం' అంటూ కదిలేడు నిరంజనం. రామస్వామిమునిసిపల్ హాస్పటల్లో కాంపౌండరు. నిరంజనంకి సహాధ్యాయి

నిరంజనంకి అనిపించింది, 'ఈ సవాశేర్లో పరాధికపుబేరాలు నాకొద్దు చెడినంత కాలం చెడ్డాను—పావాలా, బేదా కట్టి. ఇవాళ్టితో అటో యిటో తేలిపోవాలి. నా దరిద్రానికి ఇదే ఆఖరు రోజు...'

నిశ్చయమిచ్చిన సత్తువ నడకవేగాన్ని అధికంచేసింది. మాణిక్య ఖిలాన్ కొచ్చేశాడు. నిరంజనం లోపలికి అడుగు పెట్టుంటే అప్రయత్నంగా చేయి చొక్కా జేబులోకి పోయింది. రెండు పైసల నాణెం పైకొచ్చింది.

నిరంజనం ప్రాణంఉసూరుమంది 'కాఫీ నీళ్లకు లేకపోతే లేకపోయె ... పేపర్ కెలా?' అనే సమస్య యెదురైంది. భారంగా లోపలికివెళ్లి బెంచీమీద కూర్చున్నాడు.



నిరుద్యోగి నిరంజనంకి దినపత్రిక కొనకపోతే తోచదు. ఏ లైబ్రరీలోనో, రీడింగ్ రూమ్‌లోనో, హెయిర్‌కటింగ్ సెలూన్‌లోనో దినపత్రికని చదవొచ్చనే జ్ఞానం అతనికి వుంది. కాని, నిరంజనంకి అవసరమైంది వార్తా పత్రికాకాదు. దిన పత్రికలోని వార్తలూకాదు. అతని అవసరం తీరటానికి దినపత్రికకొనటం తప్పనిఫరి. అందుకనే, ఆరేళ్లనుంచీ నిరుద్యోగి నిరంజనం దిన పత్రికని— అందునా ఇంగ్లీషు దిన పత్రికని కొంటూనే వున్నాడు.

"ఇవ్వాళ రవ్విడ్లీ స్పెషల్. తీసుకు రానా ?" మాణిక్యం అడిగింది.

'వద్దుగానీ, పేపరివ్వు.'

'ఇదేంటి నిరంజనంగారూ. వింతగా వుంది. కాఫీ తాగందే మీరు పత్రిక ముట్టరుగా ? '– ఎదురు బెంచీమీద రంగరాజు. రంగరాజు టైలర్.

'వంట్లో బాగాలేదు రాజూ ...'

మాణిక్యం ఎక్స్‌ప్రెస్ తెచ్చి నిరం

నం ముందుంచి డబ్బులకోసం చేం...చింది. 'డబ్బులు రేపిస్తా మాణిక్యం' అంటూ పేపర్ని అందుకోబోయాడు నిరంజనం.

మాణిక్యం విసురుగా పేపర్ని వెనకు తీసుకుంది. 'చాల్లేండి. కావాలంటే కాఫీతాగండి, బోణీకాకపోయినా అరువిస్తాను. అంతేగాని పేపర్‌మాత్రం డబ్బుల్లేకుండా యివ్వను. పేపర్ల డబ్బు ఏరోజు కారోజు అప్పజెప్పెయ్యాలి'.

ఆరేళ్ళ పరిచయంలో తనకింతటి పరపతి ఉన్నట్టు అప్పుడే గ్రహించేడు, నిరంజనం. పదిహేనుపైసల పత్రికకూడా అప్పుకు దొరకదు. నిరంజనం దృష్టి రంగరాజుమీద నిలిచింది. అతన్ని అడిగితే? — ఏమో, అతనూ ఆలాగేలేదంటే 'ఉహూఁ అడిగి లేదనిపించుకోకూడదు'

నిరుద్యోగి నిరంజనంకు ఆత్మాభిమానం హెచ్చు. రంగరాజును అడగలేకపోయేడు. కాని అతనిలోని కోరిక మాత్రం పేపర్ని చూడమని తొందర చేస్తోంది. మాణిక్యం నిర్మొహమాటపు మాటల్ని నెమరువేసుకుంటూ, ఆలోచనలో పడి దిక్కులు చూడసాగేడు నిరంజనం.


రంగరాజు టిఫినూ, కాఫీముగించి మాణిక్యానికి రూపాయికాగితాన్నిచ్చేడు మాణిక్యం నలభైపైసలు తిరిగిచ్చింది. చిల్లర జేబులో వేసుకుని వెళ్తూ వెళ్తూ అన్నాడు రంగరాజు, 'ఎందుకొచ్చిన ఆశండీ నిరంజనంగారూ. ఆరేళ్ళనుంచీ చూస్తున్నదేగా నా మాట విని ఇంక వదిలెయ్యండి. ఇది మీలాంటివాళ్ళకి తగింది కాదు.'

నిరంజనం మనస్సు కుతకుత వుడికిపోయింది. 'ఇంతేనా నీ ఉచితసలహా, ఇంకేమైనా ఉందా. గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందిట'

నిరంజనం చివరి మాటల్ని పైకే అన్నాడుగానీ, అప్పటికే రంగరాజు వెళ్ళిపోయేడు. కొద్దిసేపు ఆ కసిలోనే వుండిపోయేడు నిరంజనం.

క్షణాలతర్వాత రోషం, కోపం తగ్గేయి అతనికి. నిన్నగాక మొన్న కళ్ళు తెరిచిన రంగరాజుకూడా తనకి చెప్పేవాడయిపోయేడు. ఛీ... ఛీ... మాణిక్యమేమో పదిహేను పైసలికి మొహం మొహం చూసుకుని వీల్లేదంది. తనకింతకంటే శాస్తి యింకేం జరగాలి? నిరంజనం ఇక అక్కడ కూర్చోలేకపోయేడు. లేచి బయటికి వచ్చేశాడు.

అప్పటికప్పుడే ఛళ్ళున తెల్లవారింది. పట్నంలో ప్రజాజీవనం ప్రారంభమైంది. నిరంజనం ఆలోచిస్తూ మెయిన్‌బజార్‌లో కొచ్చేడు.



ఇంట్లో భార్యాపిల్లలు, బయట పరిచయస్థులూ — ఇందరు హితబోధలు చెప్తుంటే తన కెందుకీ ఆశ? నిశ్చింతగా యింటికి పోయి పడుకుంటే సరి — ఏ బెడదా వుండదు.

'నిరంజనం!' ఎవరో పిలిచిన పిలుపుకు తలెత్తి ప్రక్కకు చూసేడు నిరంజనం.

గడియారాల షాపు ముందు మెట్లమీద కూర్చునున్నాడు భీమేశ్వరం. అతను ప్రక్క ఊళ్ళో పంచాయితీబోర్డు మెంబరు. నిరంజనంకి మిత్రుడు.

నిరంజనం అతనిదగ్గర సావెళ్లేడు.

'ఎక్కడన్నా ఉద్యోగం...'

'దొరకలేదు' అతని ప్రశ్నను పూర్తిచేశాడు నిరంజనం. భీమేశ్వరం చేతిలోని దినపత్రికలమీదకి మళ్ళింది నిరంజనం దృష్టి. వాటిల్లో తనకు కావలసిన ఇంగ్లీషుపత్రిక కూడా వుంది. ఉత్సుకతతో దాన్ని తీసుకున్నాడు నిరంజనం. యథాలాపంగా ఇచ్చేశాడు భీమేశ్వరం. [భీ]మేశ్వరం ఏవో ప్రశ్నలు అడుగుతుంటే [పొ]డిపొడి సమాధానాలు చెప్తున్నాడు [ని]రంజనం. అతని దృష్టి, ఆలోచన అన్నీ [పే]పర్లో ఆ పేజీలో అట్టడుగున వున్న [బొ]మ్మమీద వున్నాయి.

క్షణాలతర్వాత భీమేశ్వరంవద్ద [సె]లవు తీసుకుని ఇవతలి కొచ్చేడు నిరం[జ]నం. దినపత్రికని అతను అడగనూ[లే]దు, ఇతను ఇవ్వనూలేదు.

'దేవుడిలా తారసపడ్డాడు' అనుకుని ఊఫిరిపిల్చుకున్నాడు నిరంజనం. పేపర్ మడిచి చేత్తో పుచ్చుకుని గబగబ నడవసాగేడు.

•

నిరంజనంకి గుమ్మంలోనే ఎదురైంది రమ. తండ్రిచేతిలోని పత్రికవైపుచూస్తూ అన్నది రమ, 'నేనూ అమ్మా ఎన్ని చెప్పినా ఇవాళా పేపర్ తెచ్చావన్నమాట'

'అవునే. నువ్వూ నేనూ ఎంతగా నెత్తీనోరూ బాదుకున్నా ఆయనకేం పట్టింది. ఒక బాధ్యతా, బరువూ వుంటేగదా, మంచీ చెడూ తెలిసేందుకు' ఇందిర విసురుగా వచ్చింది లోపల్నుంచి.

నిరంజనం మాట్లాడకుండా తలవంచుకుని వెళ్ళి నులకమంచంలో పడుకుని మొహానికి పేపరు చాటుచేసుకున్నాడు.

'ఏభైఏళ్ళ మైనర్లకి ఏం చెప్పినా అర్థంకాదు...' రమ వెళ్ళిపోయింది దొడ్లోకి.

నిరంజనం గతుక్కుమన్నాడు. ఠక్కున పేపరు ప్రక్కన పడేశాడు. వెళ్తున్న రమవైపు చూశేడు. అతనికి చెంపన చెళ్ళున కొట్టినట్లయింది. కూతురుమాటకు అప్రయత్నంగా కళ్ళల్లో నీరు తిరిగింది.

భర్త కళ్ళల్లోకి చూసిన ఇందిర — అతనిలోని సంచలనాన్నీ, బాధనూ అర్థం చేసుకుంది. ఏదో అనబోయి నిగ్రహించుకుంది.

'ఎంత చెప్పినా వినక మీరు బాధపడి, మమ్మల్ని బాధపెడుతున్నారు' అంటూ అక్కణ్ణుంచి కదిలింది.

'నిజమే. నేనుబాధపడటం మాటెలా వున్నా, మిమ్మల్ని బాధపెడుతున్నాను' అనుకున్నాడు నిరంజనం. కూతురుమాట తలపుకొచ్చి అతని మనసంతా కలచినట్లైంది. ఏవేవో ఆలోచనలు రాసాగినై.

తాను చేస్తున్నపని సవ్యమైనది కాదని తనకుతెలుసు, కాని ఉద్యోగంకోసం తను చేసిన ఏ ప్రయత్నమూ ఫలించకపోవటం, వేరే ఏ వ్యాపకమూ లేక రోజల్లా ఇంట్లో సోమరిలా కూర్చోవటం

అదృష్టం, జాతకం, తెలివితేటల గాద తనకున్న నమ్మకం— ఇవన్నీ తననీః ర్గం లోకి త్రోసినై. కొంతదూరం నడి డు. గమ్యాన్ని చేరుకోగలననే నమ్మక తో, ఆశతో పనియస్తున్న తనను అర్థంతః గా వెనక్కు తిరిగిరమ్మంటే?—

దానికి తను సిద్ధపడ్డాడు ఇ దిర ఉప్పుకో చింతపండుకో ఉపయో డే పైసల్ని దీనికోసం వెచ్చించటం అః వేక మని తనకూ అనిపించింది. కాని, వరి సారిగా ఒక్కప్రయత్నం చేయాలని దా తను నిశ్చయించుకున్నది ?—

అవును. రేపట్నుంచీ తన జీః తం గొప్ప మలుపు తిరగబోతోంది. ఈ ళ తన నిశ్చయం మారకూడదు. ఇం ర, రమ... వాళ్లిద్దరి మాటల్లోని ఆవేదన ు, బాధ్యతను, బాధను – తను అర్థం ను కున్నాడు. అయినా చివరిసారిగా వా ళ్ళ కోరిన కోరికను మన్నించలేడు తను

అదృష్టంమీద తనకున్న నమ్మక ికి తోడు కృషికూడా అవసరం. అందు నే తను ఉదయాన్నే పేపరుకోసం వెళ్లే ం. దాన్ని అతిజాగ్రత్తగా నిశితంగా ః శీ లించి— 'ఛార్ట్స్'ని చూసి సంఖ్యని నిర్ణ యించాలి.

నిరంజనం లేచికూర్చున్నాడు. ఎదు రుగా రాజ్యం చేటలో బియ్యంపోసుకుని రాళ్ళు ఏరుతోంది. ఇందిర వంటింట్లో పనిలో నిమగ్నమైంది. రమ స్కూల్‌కి వెళ్ళిపోయినట్లుంది. అడిగేడు, "రాజ్యం, అక్కయ్యేదీ" "స్కూల్‌కి వెళ్ళింది"

నిరంజనంలేచి గోడకి తగిలించివున్న జాజిచెక్కల షెల్ఫ్ దగ్గఱికి పోయేడు. దానిలో క్రింది అరలో పుస్తకాల అడు గునవున్న చిన్న నోట్‌బుక్‌నీ, పై అరలో వున్న భూతద్దాన్నీ, కళ్లజోడునూ తీసు కుని – ఇవతలి కొచ్చేడు. వాటితోపాటు పేపర్నిగూడా తెచ్చి గోడవారగా కూల బడ్డాడు,

నిరుద్యోగి నిరంజనం గొప్ప ఉద్యో గంలో పడ్డాడు. పేపర్లో ఆ బొమ్మవైపు భూతద్దంలోనుంచీ చూ డ సా గే డు. దాన్నుంచీ ఏవేవో అర్థాల్ని, అంకెల్నీ గుణించటం మొదలెట్టేడు. మధ్య మధ్య నోట్‌బుక్ తెరిచి పొడుగుపాటి కాగి తాన్ని నేలమీద ప రు స్తు న్నా డు. దాన్నుంచీ కొన్ని అంకెల్ని తీసుకుంటూ ఏవో లెఖ్ఖలు వేయటం సాగిస్తున్నాడు.

సెకన్లు నిముషాలైనాయి. నిముషాలు గంటలుగా మారుతున్నాయి. ఉదయం మధ్యాహ్నమైంది.

"అమ్మయ్య" అని సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు నిరంజనం. నోట్‌బుక్ మూసి ప్రక్కన పెట్టేడు. పేపర్ని మడిచి పడేసేడు. కళ్లజోడు తీసి చేత్తో పట్టు కున్నాడు. చుట్టూ వోసారి కలయజూ సేడు. ఎవరూ కనిపించలేదు. 'పిల్ల లంతా వంటింట్లో అన్నాలు తింటున్నట్టు న్నారు' అనుకున్నాడు.

నిరంజనంకి గొప్ప వి జ యా న్ని సాధించానన్న తృప్తి కలుగుతోంది. అతని ముఖంలో ఆనందం తొణికిసలాడు తోంది. తనలోతను 'టూ ఎయిట్, ఎయిట్‌టూ' అనుకుంటూ గాలిలో ఆ అక్షరాల్ని రాసేడు. వెంటనే జేబులో నుంచీ పెన్సిలుతీసి పేపర్‌మీద 2, 8 – 8, 2 అని పిచ్చి పిచ్చిగా గీయసాగేడు. మరోకొన్ని క్షణాలకి అదే పేపర్‌మీద 100X80 = 8000; 1000X80 – 80,000 అని ఇలా ఏవేవో అంకెల్ని వేయసా గేడు.


'ఏంవిటీ పిచ్చిగీతలు? ...'చొక్కాతో మూతి తుడుచుకుంటూ పరిగెత్తుకొచ్చి అడిగేడు రాజు.

నిరంజనం వా డి వై పు అ దో లా చూసేడు. రాజు అమాయకంగా తండ్రి కళ్ళల్లోకి చూసేడు. 'ఇలారా, రాజూ' పిల్చేడు నిరంజనం.

రాజు తండ్రి దగ్గరగా వ చ్చే డు. నిరంజనం వాణ్ణి ఆప్యాయంగా రెండు చేతుల్లోకి తీసుకుని, ఒళ్లో కూర్చోబెట్టు కున్నాడు. పేపర్‌వైపు వేల్తో చూపుతూ "ఇదంతా డబ్బురా రాజూ ... రేపో ఎల్లుండో మనం గొప్ప భాగ్యవంతులమై పోతాం" అన్నాడు. వాడి కళ్ళు ఆశతో, ఆనందంతో మెరుస్తాయని ఆ శిం చి న నిరంజనంకి ఆశాభంగం కలిగింది.

రాజు గడుసుగా అడిగేడు, "ఇదంతా డబ్బా ... చిత్తుకాగితం, పిచ్చిగీతలూచూపి డబ్బంటావేం నాన్నా ?"

"అదంతేలే రాజూ ... నువ్ పోయి



దువుకో" అంటూ వాణ్ణి ప్రక్కకి పంపేడు నిరంజనం. ప్రక్కకి చూసేసరికి రమ, రాజ్యం తన మాటలకు ముసి ముసి నవ్వులు నవ్వుతూ వుండటం కనిపించింది నిరంజనంకి. అతని మొహం వెలవెల బోయింది. 'పిల్లల దృష్టిలో రోజు రోజుకూ చులకనై పోతున్నాను' అనుకునే సరికి నిరంజనంకి బాధకలిగింది. అంతలోనే అనిపించింది— "రేపొద్దున్న వేలూ, లక్షలూ వస్తే వాళ్ళకే తెలిసొస్తుందిలే నా విలువ" అని.

ఓల్డ్ ఎఫ్. ఏ. నిరంజనంకి – వెంటనే స్ఫురించింది అసలు విషయం. రేపొద్దున వేలూ, లక్షలూ రావాలంటే – ఈవేళ వందలూ, వేలూ కావాలి!

నిరుద్యోగి నిరంజనంకి ఈ సమస్య పెనుభూతమై కనిపించింది. అతనిలో ఆలోచన రగిలింది. అవును. తను అంకెల్ని నిశ్చయించుకున్నాడు. తన అదృష్టాన్నిపట్టి లాక్కొచ్చి తన గుప్పిట నిలువుకున్నాడు. నిజమే. తన తెలివి తేటల్ని తను సద్వినియోగ పరచుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకున్నాడు.

కాని,

కానీ—

తన పథకాన్ని అమలుపర్చటానికి కావలసిన సాధనం ?– ఎలా దాన్ని సేకరించటం ?–

నిరంజనంకి ఎప్పుడో తన ఆఫీసర్ అన్నమాటలు గుర్తుకొచ్చేయి. ఆయన్నాడు, "నువ్ చాలా జీనియస్‌వోయ్ నిరంజనం. నిరంజనం, నీ బుర్రంతా కాపే. కానీ, అది ఆలోచనలు, పథకాల రూపంలో ఉండిపోయింది."

ఆయన మాటలు నిజమనిపించేయి. నిరంజనంకి ఏం చేయాలో పాలుపోలేదు.

"అమ్మ అన్నానికి రమ్మంటోంది" రాజ్యం మాటకు ఈ లోకంలోకొచ్చేడు నిరంజనం. లేచి పెరట్లోకి నడిచేడు.

—తన ఆలోచనల నన్నిటినీ సహధర్మచారిణికి చెప్పేడు నిరంజన. అతని మాటల్లోని ఆవేశాన్నీ, రేపు కాటన్ మార్కెట్లో రాబోయే నెంబరు 8.2 – 2 లో ఒకటై వుంటుందన్న అతని నమ్మకాన్నీ తెలుసుకుంది ఇందిర. అతను చెప్పిందంతా విని, చివరికి తన ఉద్దేశ్యం చెప్పింది — "మన జాతకమేమిటో మనకు తెలుస్తూనే వుంది. మనమొహాలకు అంత అదృష్టం లేదు. అవును."

నిరంజనం పరీక్షగా ఆవిడ ముఖంలోకి చూసేడు.

"నిజమండీ. మీ అదృష్టం బాగున్నా– పిల్లవాళ్ల అదృష్టం బాగుండాలికదా. మనం అంతటి భోగజాతకులం కాము. నాకు తెలుసు."

నిరంజనం నీరు కారిపోయేడు. మరు క్షణంలోనే అతనికి భార్యంటే కోపమూ, కసీ కలిగేయి. నిరంజనం నిరుద్యోగి!

"ఇంతకీ నువ్వుగానీ. రమగానీ ఏమీ ఇవ్వమంటారు, అంతేనా ?" ఉమ్మి బిగపట్టి అడిగేడు నిరంజనం.

"ఇవ్వమనటం లేదు. మా దగ్గర డబ్బులేదంటున్నాం."

"సరే ... కానివ్వండి" అనీ "హాం..." అంటూ పేలవంగా నవ్వేడు నిరంజనం.

నిరుద్యోగి నిరంజనంకి నవ్వటంలోపలఏడుస్తున్నాపైకిచాతొచ్చు.

లోలోపల ఏడుస్తూ పైకి నవ్వుతున్న నిరుద్యోగి నిరంజనం – ఈ ఆపత్సమయంలో తనను ఆదుకోగల నవ్వుల రాయుళ్ల నందర్నీ గుర్తుకు తెచ్చుకోసాగేడు. ఎవరెవరో కనుపించి, అంతలోనే కనుమరుగౌతున్నారు. వాళ్లంతా ఇతర ఊళ్లల్లో ఎక్కడో వున్నవాళ్లు. చేత పైసాలేని తను వాళ్ల దగ్గఱకి వెళ్ళొచ్చి అవసరం గడుపుకోవటమనేది అసంభవం. పైగా సాయంత్రంలోగా తను డబ్బు సేకరించాలి. ఇక ఊళ్లో పరిచయస్థులు!—

నిరంజనంకి మాణిక్యం చేసిన ఉపకారం గుర్తుకొచ్చింది. తన పరపతీ అర్థమైంది. అయినా అతనిలో ఆశ చావలేదు. ఆలోచనా పరిధిని విస్తృతం చేసేడు.

రాఘవయ్య కనిపించేడు. అతన్నొక చెయ్యి అడిగి తీసుకుంటే ? — రేపో ఎల్లుండో యివ్వవచ్చు ... నిరుద్యోగి నిరంజనంకి మరో ఆలోచనొచ్చి శరీరాన్ని గజగజ లాడించింది. రేపు – తను నమ్ముకున్న 8,2 – 2,8 లు ఏ 0,0 గానో మారిపోతే ?– నిరంజనం మనస్సు భయంతో చలించిపోయింది. రాఘవయ్య ఇంట్లో ఊడిగం చేసికూడా అతని ఋణం తీర్చుకోలేడు తను.

నిరుద్యోగి నిరంజనం ఆశల ఊడల్ని కుంచించ చేసేడు. ఒక వందరూపాయలు కత్తే చాల్లే అనుకున్నాడు. దీన్తోవచ్చే డబ్బుతో ఏదో వో వ్యాపారం మొదలెట్టి బతుకుతెరువు కల్పించుకోవచ్చు అని సరిపెట్టుకున్నాడు. వందయితే రాఘవయ్య ఇవ్వవచ్చు.

ఆశాజీవి నిరంజనం బయల్దేరేడు.

రాఘవయ్య దగ్గఱ – నిరంజనం తల్లి పల్లెటూళ్లో చావు బ్రతుకుల మధ్య



కొట్టుకు లాడింది. "అయ్యో పాపం..." తో సరిపెట్టేడు రాఘవయ్య.

రామస్వామి దగ్గఱ– నిరంజనంభార్య తీవ్రమైన గుండె జబ్బుకి గురయింది. "మా హాస్పటల్లో చేర్పించు. డాక్టర్‌కి నే సిఫారసు చేస్తాను" తో పెదవి విరిచేడు రామస్వామి.

భీమేశ్వరం దగ్గఱ – నిరంజనం పెద్దకొడుకు సత్యం నాగపూర్‌లో ఎమ్మే చదువుతూ సగంలో ఆపేయాల్సొచ్చింది. "ఐయామ్ సారీ నిరంజనం"తో మొండి చెయ్యి చూపేడు భీమశంకరం.

ఆశాజీవి నిరజనంలో ఆశఅడుగంటింది. నిరుద్యోగి నిరంజనంలోని కసి, ద్వేషం, కోపం, రోషం–తారాస్థాయినందుకున్నై. వీటన్నిటినీ లొంగదీస్తూ అసహాయత అతన్ని ఏడ్పించబోయి నవ్వించేస్తోంది.

ఆత్మాభిమానంగల నిరంజనం తాత్కాలికంగా దాన్ని తొలగించుకుని మాణిక్యాన్ని శరణుజొచ్చేడు. "వస్తే మూడొంతులు నాది, ఒక్క వంతునీది. రాకుంటే నా సొమ్ము కివ్వాలి—రోజుకు రూపాయకి పైసా వడ్డీతో—"చిన్నప్పుడు చదువుకున్న షైలాక్ గుర్తుకొచ్చేడు—ఓల్డు ఎఫ్.

ఏ. నిరంజనం గొంతులో పచ్చివెలక్కాయతో ఇవతలకొచ్చి పడ్డాడు.

క్లాక్ టవర్‌లో సాయంత్రం ఆరైంది. ఆశాజీవి నిరంజనం పిచ్చివాడై పోతున్నాడు.

'టైమయిపోతోంది, ఎలా... ఎలా?' అని జుట్టు పీక్కుంటూ రోడ్లవెంట తిరుగుతున్నాడు. షాపుల్లో వందల కాగితాలు మార్చి అవీ యివీ కొంటున్న వాళ్లని చూస్తుంటే అతనికి కడుపు రగిలి పోతోంది. ఉన్నపళాన ఆ కొట్లల్లో దూరబడి అందినంత డబ్బు పుచ్చుకు పరిగెత్తుకొచ్చి 2,8-8,2 మీద సరదాగా కట్టేయాలని పిస్తోంది. ఖరీదైన ఆభరణాలు పెట్టుకుని బజార్ను వెళ్తున్న స్త్రీలని నిలవేసి సొమ్ములు లాక్కుని పారిపోవాలనిపిస్తోంది.

కాని, గుమస్తా నిరంజనం—నిరుద్యోగి నిరంజనంలో ప్రవేశించి 'అగు అగు' అంటున్నాడు.

'ఎవన్నా కానీ, ఇవాళ ధ్యేయాన్ని నెరవేర్చాల్సిందే' క్రింది పెదవిని బిగపట్టి చుట్టూ కలయజూశాడు. నిరంజనం. తను అప్పటివరకూ సెంటర్లో నిలబడివున్నట్టు తెలుసుకున్నాడు. వచ్చే పోయే జనాన్ని పరీక్షగా చూడసాగేడు—ఎవరైనా పరిచయస్థులు కనిపిస్తారేమోనని.

నిముషాలు గడుస్తున్నై.

టవర్ క్లాక్ ఆరూనలభై చూపిస్తోంది.

ఆశాజీవి నిరంజనంకి పెన్నిధి దొరికింది! పెద్దపాలి కేక పెట్టేడు 'రామ్మూర్తీ' అంటూ కుడిచేతిని బారెడు ముందుకు జాపి.

బీట్ కానిస్టేబుల్‌కి ప్రదక్షిణచేసి నిరంజనం ముందుకొచ్చి ఆగింది. స్కూటర్.

'దేవుడిలా కనిపించావ్ రామ్మూర్తీ' కౌగిలించుకున్నాడు నిరంజనం. రామ్మూర్తి లక్షాధికారి. నిరంజనంకి ఎఫ్. ఏ. లో క్లాస్ మేట్.

'సరి... సరి... ఇంతకి ఏవిఁటివిశేషం? ఇక్కడేం చేస్తున్నావ్?' ప్రశ్నలవర్షం కురిపిస్తూనే—స్కూటర్ వెనక సీట్లోవున్న వ్యక్తిని పరిచయం చేశాడు రామ్మూర్తి 'ఇతను నా బెస్టు ఫ్రెండ్ మిస్టర్ రాజశేఖరం ఈ మధ్యనే అమెరికానుంచి తిరిగొచ్చేడు. త్వరలోనే ఏదైనా వ్యాపారం ప్రారంభించాలను కుంటున్నాడు.'

పరస్పరం అభినందించుకోనటం పూర్తయింది. నిరంజనం రామ్మూర్తి, రాజశేఖరంవైపుచూసి తనను తాను పరీక్షించుకున్నాడు.

నిరుద్యోగి నిరంజనంలో ఆత్మన్యూనతాభావం తొలిసారి పైకొచ్చింది. సిగ్గుపడ్డాడు.

—ముగ్గురూ కలిసి డ్రింక్స్ త్రాగడం పూర్తయింది. రామ్మూర్తిని ఆతృతగా ప్రక్కకి పిల్చేడు నిరంజనం 'ఫర్వాలేదు, చెప్పు. ఇతను నాకు కాబోయే అల్లుడు కూడా. మధ్య రహస్యాలేం లేవు...' అన్నాడు రామ్మూర్తి.




తటపటాయిస్తూనే అడిగేడు: '...నేను ఏదో బిజినెస్ పని మీద ఈ ఊరొచ్చాను. నా దగ్గర అంతడబ్బులేదు' అన్నాడు.

'పోనీ, కనీసం ఓ వంద యివ్వు...' నిరంజనంకళ్లలోనీళ్లుతిరిగినై. రామ్మూర్తి చేతులు పట్టేసుకున్నాడు. రాజశేఖరం ఈ సంభవానికి ఆశ్చర్యపోయేడు.

రామ్మూర్తి మొండికేసేడు. కారణం చెప్తేగానీ ఇవ్వనని సగంచచ్చి, హీన స్వరంతో చెప్పేడు ఆశాజీవి నిరంజనం అవసరాన్ని విన్న రామ్మూర్తి అతితేలిగ్గా నవ్వేసి పిచ్చి చేష్టలూ నువ్వూ ను. యేఁవిట్రా నీ నమ్మకం అంటూటా..టా చెప్పి స్కూటరెక్కేడు.

నీళ్లు నిండిన కళ్లతో వాళ్లనే చూస్తుండిపోయేడు నిరుద్యోగి నిరంజనం.

రాత్రి పన్నెండింటి దాకా ఎక్కడెక్కడో తిరిగి యింటికిచేరిన నిరంజనాన్ని చూసి కంగారుపడ్డారు ఇందిరా, రమామూర్నాడుఉదయంబజారుకివెళ్లొచ్చి ఆశాజీవి నిరంజనం 'టూఎయిట్'అంటూ పలవరిస్తూ కాగితాలమీద అవే అంకెలు గీస్తూ కూర్చుండిపోయేడు. ఇందిరరమ—అసలు విషయం తెలుసుకుని గ్రుడ్ల నీరు గుడ్ల కుక్కుకున్నారు.

నెలరోజుల తర్వాత,

'రాజశేఖర్ అండ్ కంపెనీ' మేనేజరుగా నియమితుడైనాడు నిరంజనం ఆశాజీవినిరంజనం 'రాజశేఖర్‌కి నేనెంతో ఋణపడివున్నాను' అనటం మొదలెట్టేడు.

సంవత్సరం తర్వాత,

'మన ఫరమ్ గడించిన లాభాల్లో నీ వాటా ఇరవైవేలు' ఇదిగో అని రాజశేఖర్ అన్నప్పుడు ఒల్డు ఎఫ్. ఎ.నిరంజనంకి నిజంగా మతిపోయింది 'అవును నీ పెట్టుబడి ఎనభైవేలూ వ్యాపారంలో వుంది.' అన్న రాజశేఖర్ మాటలకు దిగ్భ్రమ చెందేడు—మేనేజర్ నిరంజనం!

(మిత్రుడు, కథారచయిత శ్రీ విజయమూర్తికి కృతజ్ఞతలతో అంకితం.)

●●●